క్లుప్తంగా

అయ్యప్పస్వాములకు సద్ది ఏర్పాటు



దాచేపల్లి : స్థానిక శ్రీవీర్ల అంకమ్మతల్లి దేవాలయంలో అయ్యప్ప మాలధారులకు మంగళవారం సద్ది ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి అంకమ్మ తల్లికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం మాలధారులకు సద్ది వడ్డించారు. కమిటీ సభ్యులు జంగాని ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీపీ అంబటి నవకుమార్, యలమల నరేష్ పాల్గొన్నారు.

సూర్యదేవుని ప్రతిమల పంపిణీ



కారెంపూడి: స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములకు ప్రతి రోజు మధ్యాహ్నం చద్ది కార్యక్రమం కొనసాగుతోంది. సుమారు 400 మంది స్వాములు చద్ది చేయడానికి వస్తున్నారని, వచ్చిన వారికి మంగళవారం సూర్యదేవుని ప్రతిమలు, తులసి మాలలు అందించడం జరిగిందని ఆలయ అర్చకులు కొమండూరి సత్యనారాయణాచార్యులు తెలిపారు. స్వాముల అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలందరికి పేరు పేరునా ఆయన అభినందనలు తెలిపారు.

మల్లికార్జున స్వామికి పూజలు



రెంటచింతల: కార్తిక మాసంలో కైలాసనాథుడికి పూజలు చేయడం వల్ల అంతా మంచి జరుగుతుందని వేద సీడ్స్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సత్రశాల వద్ద వేంచేసిన అతి పురాతనమైన శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ గాదె రామిరెడ్డికి 25 డస్ట్‌బిన్స్ అందజేశారు. డస్ట్ బిన్స్ అందచేసిన ధర్మచరణ్‌కు, చంద్రశేఖర్‌కు ఈఓ కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన అర్చకులు చిట్టేల శివశర్మ, వెన్నా వెంకటేశ్వరరెడ్డి తదితరులున్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

దుర్గి : స్థానిక గ్రంథాలయ శాఖ లో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి పులిబండ్ల వేణు గోపి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యార్థులకు చిత్రలేఖనం, డిబేట్, వ్యాసరచన, క్విజ్, ముగ్గుల పోటీలు, నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బస్సు రాదు.. బస్టాండ్ బాగుపడదు

- ఏడెకరాల విస్తీర్ణంలో ఆర్టీసీ బస్టాండ్
- ప్రయాణికులు రాలేదని బస్సులు నిలుపుదల చేయని వైనం
- రోడ్డుపైనే ఎండలో ప్రయాణికుల పడిగాపులు
- ఒకప్పుడు దూరం.. ఇప్పుడు చుట్టూ నివాసాలే
- సౌకర్యాలు కల్పిస్తే ఆర్టీసీకి, ప్రజలకు మేలు



నిరుపయోగంగా ఉన్న దాచేపల్లి ఆర్టీసీ బస్టాండ్

దాచేపల్లి: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది స్థానిక బస్టాండ్ పరిస్థితి. బస్సుల రాకపోకలు సాగించేందుకు సువిశాలమైన ప్రాంగణం ఉంది. ప్రయాణికుల కోసం అన్ని సౌకర్యాలూ కల్పించారు. కానీ, నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలు చేర్చే ఆర్టీసీ బస్సులకు నిలువ నీడలేకుండా పోయింది. బస్సుల కోసం కాసేపు కూడా బస్టాండ్‌లో కూర్చునే పరిస్థితి లేకుండా పోయింది. అద్దంకి–నార్కెట్‌పల్లి హైవేని అనుకుని ఉన్న దాచేపల్లి ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. అటు ప్రయాణికులకు.. ఇటు ఆర్టీసీకి ఉపయోగం లేకుండా పోయింది.

నిలువ నీడలేదు

దాచేపల్లి నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య కూడా బాగానే పెరిగింది. ఇక్కడ నుంచి గుంటూరు, హైదరాబాద్, విజయవాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడెం, నల్గొండ, కారంపూడి ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. నాగులేరు బ్రిడ్జిపై గంటల తరబడి ప్రయాణికులు నిలబడి బస్సుల కోసం వేచి చూస్తుంటారు. వృద్ధులు, దివ్యాంగులు ప్రయాణాలు సాగించాలంటే మరింతగా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కుర్చునేందుకు కనీసం ఒక్క బెంచీ కూడా లేదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు పక్కన నిలబడి బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు ఆర్టీసీ బస్టాండ్ చుట్టూ నివాసగృహాలతో పాటుగా ప్రభుత్వ కార్యాలయాలు కూడా వచ్చాయి. ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లో బస్సులు ఆపితే ప్రయాణికులు అక్కడి నుంచే రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం దాచేపల్లి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం పిచ్చిచెట్లు మొలిచి అడవిని తలపిస్తోంది. ప్రైవేట్ వాహనాలకు పార్కింగ్ స్థలంగా బస్టాండ్‌ని ఉపయోగించుకుంటున్నారు. రాత్రిళ్లు అసాంఘిక కార్యకలపాలకు నిలయంగా బస్టాండ్ మారింది. ఇప్పటికైన ఆర్టీసీ అధికారులు దాచేపల్లి బస్టాండ్‌లో బస్సులను ఆపి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

సుమారు ఏడెకరాల విస్తీర్ణంలో దాచేపల్లి ఆర్టీసీ బస్టాండ్ ఉంది. ఈ బస్టాండ్‌ని 1994 జూన్ 25వ తేదీన అప్పటి గురజాల ఎమ్మెల్యే కాయితి వెంకట నర్సిరెడ్డి ప్రారంభించారు. అప్పట్లో ఈ బస్టాండ్ దాచేపల్లి పట్టణానికి కాస్త దూరంగా ఉండేది. ప్రారంభంలో కొన్ని నెలల పాటు అధికారులు బస్సులను బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. రాను రాను ఈ బస్టాండ్‌లోకి బస్సులను రాకుండా పోయాయి. దాచేపల్లి నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎక్కువగా నాగులేరు బ్రిడ్జి సెంటర్‌లో రోడ్డుపై నిలబడి బస్సులు ఎక్కేవారు. అప్పట్లో ఈ బస్టాండ్ దూరంగా ఉండటం వల్ల ప్రయాణికులు ఇక్కడకు రాలేదు. కానీ ప్రస్తుతం ఈ బస్టాండ్ చుట్టూ పక్కల నివాస గృహాలు ఏర్పడ్డాయి.



ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నిలిపిన వాహనాలు

ప్రయాణికులు వస్తే బస్సులు ఆపుతాం

గతంలో బస్సులను బస్టాండ్‌లో ఆపాం. అటుగా ఎవరూ రాకపోవడంతో బస్సులు నిలుపుదల చేయడం లేదు. ప్రయాణికులు బస్టాండ్‌లోకి వస్తే ప్రతి బస్సుని అక్కడ ఆపుతాం. అన్ని వసతులు కల్పిస్తాం. బస్టాండ్ ప్రయాణికులకు క్షేమం, ఆర్టీసీకి కూడా ఆదాయం.

– బి. కోటేశ్వరరావునాయక్, డీఎం, పిడుగురాళ్ల

బస్టాండ్‌లో బస్సులు ఆపాలి



దాచేపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లోకి బస్సులన్నీ నిలుపుదల చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇది ప్రజలకు ఉపయోగపడితే ఇంకా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. అధికారులు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలి. బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలి.

– షేక్ సుభానీ, దాచేపల్లి

బస్సులు ఎక్కేందుకు ఇబ్బందులు



దాచేపల్లిలోని నాగులేరు బ్రిడ్జి వద్ద ఇప్పుడు బస్సులు ఆపుతున్నారు. ఇక్కడ గంటల తరబడి రోడ్డుపై నిలబడి బస్సులు ఎక్కడం బాగా ఇబ్బందిగా ఉంది. సంబంధిత అధికారులు ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రయాణికులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– నెల్లూరి కోటేశ్వరరావు, కేసానుపల్లి

పిట్ట కొంచెం కూత ఘనం

- 7వ తరగతికే.. 9 హిందీ భాష పరీక్షలు పూర్తి
- అబ్బుర పరుస్తున్న గురజాల చిన్నారి మన్విత రియా
- తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ముందుకు

గురజాల: పిట్ట కొంచెం కూత ఘనం. అది కూడా హిందీలో. గురజాలకు ఈ చిన్నారి హిందీ భాష పరీక్షల్లో తన ప్రతిభతో అబ్బుర పరుస్తోంది. చదివేది 7వ తరగతి అయినా.. స్థాయికి మించి రాణిస్తోంది. తండ్రి హిందీ ఉపాధ్యాయుడు కావడంతో.. కుమార్తె బాషా ప్రావీణ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పిన్న వయస్సు నుంచే హిందీ బాషపై పట్టు సాధించేలా శిక్షణనిచ్చి, ఈ ఏడాది సెప్టెంబరు నాటికే ప్రవీణ్ ఉత్తరార్ధి పూర్తి చేసిందంటే ఆమె ప్రతిభ ఎంతటితో గుర్తించవచ్చు. హిందీ బాషా పరీక్షలు మొత్తం 9 పూర్తి చేసినా ఏకైక చిన్నారిగా రికార్డుల్లోకి ఎక్కించవచ్చు.

గురజాలకు చెందిన మట్టపల్లి రవికుమార్, షేక్ తాజూన్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దమ్మాయి మన్వితా రియా స్థానిక లిటిల్ ఫ్లవర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో చదువుతోంది. దక్షిణ భారత హిందీ ప్రచార సభ (మద్రాసు)లో నిర్వహించిన అన్ని హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించింది. 2019 నుంచి 2024 వరకు నిర్వహించిన 9 హిందీ బాషా పరీక్షలు రాసి, ప్రథమ శ్రేణిలో నిలిచింది. 2019 పరిచయ, 2020 ప్రాథమిక, 2021 మాధ్యమ, 2022 రాష్ట్ర భాషతో పాటు ప్రవేశిక, 2023లో విశారద పూర్వార్ధతో పాటు విశారద ఉత్తరార్థ.. 2024లో ప్రవీణ పూర్వార్ధ, ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలు విజయవంతంగా పూర్తి చేసింది. అందరి మన్ననలు అందుకుంది. ఎవరూ కూడా ఇంత చిన్న వయస్సులో ఇన్నీ పరీక్షలు రాసి, ఉత్తీర్ణత సాధించలేరని పలువురు బాషా నిపుణులు అంటున్నారు.



సర్టిఫికెట్లుతో మట్టపల్లి మన్విత రియా

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే

మన్వితా రియా తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఇదంతా సాధించగలిగానని చెబుతోంది. తల్లిదండ్రులిద్దరూ ప్రైవేట్ ఉపాధ్యాయులు. తాజూన్ హిందీ కోచింగ్ సెంటర్‌ను గురజాలలో ఏర్పాటు చేశారు. విద్యార్థులకు హిందీ బాషపై పట్టు సాధించాలనే దృఢ సంకల్పంతో శిక్షణనిస్తున్నారు. 2వ తరగతి నుంచే హిందీ బాషలో రియా కోచింగ్ తీసుకుందని తండ్రి రవికుమార్ తెలిపారు.

మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు



సత్రశాల(రెంటచింతల): కార్తిక మాసం సందర్భంగా మంగళవారం గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం పరమేశ్వరుని నామస్మరణతో మార్మోగింది. పవిత్ర కృష్ణానదిలో భక్తులు కార్తీక పుణ్యస్నానాలు ఆచరించి, దేవస్థానంలోని ధ్వజ స్తంభం, తులసిచెట్టు, నవగ్రహాల మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అర్చకులు చిట్టేల శివశర్మ నేతృత్వంలో స్వామివార్లకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గణపతి, రుద్ర హోమాల్లో పాల్గొన్నారు. ఈఓ గాదె రామిరెడ్డి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అధికారుల సలహాలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ ప్రవీణ్



మిరప పంటను పరిశీలిస్తున్న ఏఓ సంధ్యారాణి

గురజాల రూరల్ : రైతులు సాగులో అధికారుల సలహాలు తీసుకోని మంచి దిగుబడి సాధించాలని మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని 3, 4 సచివాలయాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చేపట్టాలి

రెంటచింతల: ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటలకు ఆశించే పచ్చ పురుగు, మచ్చల పురుగు, రసంపీల్చు పురుగు వంటి క్రిమికీటకాలను ఎక్కువగా నష్టం కలిగిస్తాయని వాటి నిర్మూలనకు రైతులు వ్యవసాయాధికారుల సూచనలతోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం నర్సరావుపేట ఏఓ ప్రవీణ్ అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని గోలి గ్రామంలోని రైతులకు ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆయన మాట్లాడారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారి సూచనల మేరకు రసాయనిక మందులను వాడటం వలన తక్కువ ఖర్చుతో పంటలను కాపాడు కోవచ్చన్నారు. ఈ సమావేశాలలో మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర రూ.7,521లు

పిడుగురాళ్లరూరల్: మండలంలోని కోనంకి, పాతగణేశునిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సభలో రైతులను ఉద్దేశించి ఏడీఏ బి. శ్రీ కృష్ణదేవరాయులు మాట్లాడుతూ.. పత్తి పంట సీసీఐ కొనుగోలులో అమ్ముకోవచ్చునని, కనీసం మద్దతు ధర క్వింటాకు రూ.7,521 అని తెలియజేశారు. అలాగే కందులు, ధాన్యము కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ ఏవో ఎస్. శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ సహాయకులు రాజశేఖర్, ఉమామహేశ్వరరెడ్డి, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ కృష్ణదేవరాయులు

పత్తిలో మెగ్నీషియం లోపం

మాచవరం: పత్తి పంటలో మెగ్నీషియం లోపం కనిపిస్తుందని నివారణకు ఎకరానికి 10 కేజీల మెగ్నీషియం సల్ఫేట్‌ను చల్లుకోవాలని ఏఓ కె.రామమ్మ అన్నారు. మండలంలోని మోర్జంపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పత్తి, కంది, మిరప పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ కె.రామమ్మ, వ్యవసాయ సహాయకులు జానీబాషా, మణిదీప్తి గ్రామ రైతులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

గురజాల : స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాచవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన చల్లగుండ్ల లక్ష్మీ జ్ఞాపకార్థం మనవడు నల్లా నవీన్ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆశ్రమ నిర్వహకుడు చింతకాయల ఏసయ్య, జానకీరామ్ పాల్గొన్నారు.

సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసియున్న శ్రీ సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం ఏకాదశి సందర్భంగా ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరణలో భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను పొందారు.

తహసీల్దారు బాధ్యతలు స్వీకరణ



కారెంపూడి: నకరికల్లు తహసీల్దారు కె.పుల్లారావు మంగళవారం మండల తహసీల్దారు అదనపు బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దారు ప్రసాద్ గత నెలాఖరున ఉద్యోగ విరమణ చేయడంతో డీటీ ఆర్.వెంకటేశ్వర్లు నాయక్ ఇన్‌చార్జిగా ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించారు.

మహిళ ఆత్మహత్య



దుర్గి : మండల పరిధిలోని పోలేపల్లి గ్రామానికి చెందిన మహిళ చెన్నూరి స్వప్న (32) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు ఇంటి వద్ద చీరలు అమ్ముతూ జీవన సాగిస్తూ ఉంటుంది. భర్త వీరారెడ్డి గ్రామంలో కిరాణ దుకాణం నిర్వహిస్తూ ఉంటాడు. వీరివురు దంపతులు అన్యోన్యంగా జీవిస్తున్న క్రమంలో స్వప్న ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబంలో విషాదం నింపింది. మృతురాలికి ఇద్దరు సంతానం. ఆత్మహత్యకు పాల్పడిన కారణం తెలియాల్సి ఉంది. సమాచారాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేస్తున్నారు. ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఉపాధి హామీ పనుల పరిశీలన



మాచవరం: మండలంలోని కొత్తపాలెం, సింగరాయపాలెం తండా, మోర్జంపాడు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.సిద్ధాలింగమూర్తి మంగళవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన గోకుల షెడ్లు, సీసీ రోడ్లు, సైడ్ డ్రైయిన్స్ అభివృద్ధి పనులను పరిశీలించి , వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించేందుకు సిబ్బంది కృషి చేయాలని తెలియజేసారు. ఆయన వెంట ఏపీడీ మల్లికార్జున, ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, ఏపీఓ వెంకటేశ్వర్లు నాయక్,పీఆర్ ఏఈ నాగేశ్వరావు, సిబ్బంది ఉన్నారు.

హుండీ లెక్కింపు

గురజాల: మండల పరిధిలోని దైద గ్రామంలో వేంచేసియున్న అమరలింగేశ్వర స్వామి దేవాలయం హుండీని మంగళవారం లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పూర్ణచంద్రరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ దర్శనం టికెట్ల ద్వారా రూ.90,700, అభిషేకం ద్వారా రూ.32,600, తలనీలాల ద్వారా రూ.1350, హుండీ ఆదాయం రూ.70,875 కలిపి మొత్తం రూ.1,95,525 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. లెక్కింపులో సత్తెనపల్లి దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం

ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు

శావల్యాపురం: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని వినుకొండ ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని మతుకుమల్లి గ్రామంలో అక్రమంగా మద్యం సీసాలు (వీఎస్‌ఐపి) అమ్మకం చేస్తున్న వయ్యకంటి వెంకట్రావుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించటం చట్టరీత్యానేరమన్నారు. వినుకొండ, నూజెండ్ల, శావల్యాపురంమండలాల పరిధిలో ఇప్పటి వరకు అక్రమంగా మద్యం సీసాలు అమ్ముతున్న వారిపై 10 కేసులు నమోదు చేశామన్నారు. అలాగే మద్యం దుకాణాదారులు ఎంఆర్‌పీ ధరలకే సీసాలను అమ్మాలని, ఫిర్యాదులకు తావులేకుండా ప్రభుత్వ నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలన్నారు. గ్రామాల్లో పోలీసు నిఘా ఉంచామని, బెల్టుషాపుల నిర్వహిస్తే అటువంటివారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

పులకించిన మంచికల్లు



పూజలు చేస్తున్న గురుస్వామి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: మండలంలోని మంచికల్లు గ్రామం మంగళవారం రాత్రి అయ్యప్పస్వాములు పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురుస్వామి బద్దూరి బ్రహ్మారెడ్డి నేతృత్వంలో అయ్యప్పస్వామివారికి 18 రకాల పంచాంమృతాభిషేకాలతో పాటు వివిధ రకాల పూజాకార్యక్రమాలు చేపట్టారు. అయ్యప్పస్వాములతోపాటు వివిధ స్వామిమాలలు ధరించిన వందలాదిమంది శరణం శరణం అయ్యప్ప....స్వామి శరణం అయ్యప్ప అంటూ చేసిన అయ్యప్పనామస్మరణతో మంచికల్లు గ్రామం పులకించి పోయింది. అయ్యప్పజీవిత చరిత్రకు సంబంధించిన పాటలతో హోరెత్తించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో చేపట్టిన మణికంఠుడి భజనతో స్వాములు తన్మయత్వం చెందారు. అరటిబోదలతో ఏర్పాటుచేసిన అయ్యప్ప మండపం,18 మెట్లు భక్తులను విశేషంగా ఆకర్షించాయి.

పాలనపై దృష్టిపెట్టని కూటమి ప్రభుత్వం

టీడీపీ మూకల చేతిలో గాయపడిన లక్ష్మారెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కాసు



పల్నాడు హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న నర్రెడ్డి లక్ష్మారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: మండలంలోని జూలకల్లు గ్రామంలో టీడీపీ మూకల దాడిలో గాయపడిన నర్రెడ్డి లక్ష్మారెడ్డిని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం పాలనపై దృష్టిసారించకుండా పాలనలోని లోపాలను ఎత్తి చూపేవారిపై దాడులు చేయటం , అక్రమంగా అరెస్టు చేయించటం చేస్తోందన్నారు. పొలం పనులు చేసుకొని వచ్చిన వ్యక్తిపై దారుణంగా దాడి జరిగితే.. పోలీసులు దాడి జరగలేదని చెప్పడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి దాడి చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గ నాయకుడు డాక్టర్ అశోక్‌బాబు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిండు విశ్వాసంతో ప్రార్థించాలి



సమష్టి దివ్యపూజాబలి సమర్పణ

రెంటచింతల: తోటివారిని ప్రేమించే కృపను దయ చేయమని పునీత అంతోనివారిని నిండు విశ్వాసంతో కుటుంబ ప్రార్థన చేయాలని క్రోసూరు చర్చి విచారణ గురువులు రెవ ఫాదర్ గాదె కిశోర్‌రెడ్డి కోరారు. స్థానిక అంతోనివారి చర్చిలో నిర్వహిస్తున్న 9 మంగళ వారోత్సవాలను పురస్కరించుకుని కానుక మాత చర్చి విచారణ గురువులు ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన 4 వ మంగళవారం సమష్టి దివ్యపూజాబలిని సమర్పించారు. ఈ సందర్భంగా కిశోర్‌రెడ్డి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పునీత అంతోనివారు ఏసుక్రీస్తు సూక్తులను ఆచరించి బోధనలు చేస్తూ తాను కూడ క్రీస్తు సువార్తను ప్రచారం చేయడం వలన పునీతుడయ్యారన్నారు. అంతోనివారిని ఆదర్శంగా తీసుకుని మన ఇరుగుపొరుగు పట్ల ప్రేమ, దయ, కరుణ చూపి నిజమైన కథోలికులుగా సమాజంలో మెలగాలన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అంతోనివారి చర్చిని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ పూజాబలిలో సహాయక గురువులు అగస్టీన్, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఆదాయం

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతులు ఎరువులు, కషాయాలు సొంతగా తయారు చేసుకోవడం వలన పెట్టుబడి ఖర్చు తగ్గి ఆదాయం లభిస్తుందని డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. పట్టణంలోని అంజిరెడ్డి సమావేశ మందిరం మంగళవారం మాచర్ల డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అమలకుమారి, రాష్ట్ర రీసోర్స్ పర్సన్‌లు రామచంద్రన్, ఉషలు పాల్గొన్నారు. ఈసందర్భంగా అమల కుమారి మాట్లాడుతూ రైతులు తమ పంటలకు అవసరమైన ఎరువులైన బీజామృతం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతంలు తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చని తెలిపారు. దీని వలన రసాయన ఎరువులకు పెట్టే ఖర్చు పూర్తిగా తగ్గించుకోవచ్చని తెలిపారు. దీంతో పాటు పంటపై పిచికారీ కోసం కోడిగుడ్డు, నిమ్మరసం, చేప బెల్ల ద్రావణం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అజ్ఞాస్త్రం, పుల్లటి మజ్జిగను రైతులు తయారు చేసుకోవచ్చని తెలిపారు. రసాయన వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు పంట పెట్టుబడిలో పిచికారీ కోసం 30 శాతం ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.